క్లుప్తంగా

బాధిత కుటుంబాలకు అండగా పోలీస్ శాఖ



కానిస్టేబుల్ నరేంద్ర సతీమణికి చెక్కును అందిస్తున్న అదనపు ఎస్పీ భాస్కర్

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో పోలీస్ శాఖలో పనిచేసే సిబ్బంది మరణిస్తే వారి కుటుంబాలకు ఎల్లవేళలా పోలీస్ శాఖ అండగా ఉంటుందని ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కర్ అన్నారు. ఏలూరు జిల్లా ఎస్పీ డి.మేరిప్రశాంతి ఆదేశాల మేరకు నూజివీడు సబ్‌డివిజన్ ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తూ దుండగుడి దాడిలో మరణించి గంధం నరేంద్ర సతీమణికి కార్పస్ ఫండ్ నుంచి రూ.1 లక్ష చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరణించిన పోలీస్‌సిబ్బంది శాఖలో లేకపోయినా వారి కుటుంబానికి తామంతా అండగా ఉంటామన్నారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీలు త్వరితగతిన వచ్చేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సాబ్జి మృతి తీరని లోటు



సాబ్జి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఎమ్మెల్సీ షేక్ సాబ్జి అకాల మరణం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, కర్షక లోకానికి తీరని లోటని మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు అన్నారు. పీఆర్‌టీయూ ఏపీ పక్షాన సోమవారం సాబ్జి నివాస గృహానికి చేరుకుని ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఉపాధ్యాయుల హక్కుల కోసం సాబ్జి చేసిన పోరాటాలు అందరి గుండెల్లో అనునిత్యం గుర్తుండిపోతాయన్నారు. పీఆర్‌టీయూ రాష్ట్ర, జిల్లా నాయకులు మిట్టా కృష్ణయ్య, బైరి అప్పారావు, పువ్వుల ఆంజనేయులు, బెజవాడ ధర్మారావు, ముర్కలీస్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఈనెల 19వ తేదీ నుంచి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ రీజనల్ మీట్ తాడేపల్లిగూడెంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో ప్రారంభమౌతుందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఫణీంద్ర ప్రసాద్ సోమవారం ఏలూరులో ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమం 21న ముగింపు వేడుక ఉంటుందని పేర్కొన్నారు. ఈ క్రీడా పోటీల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని 11 పాలిటెక్నిక్ కళాశాలల నుంచి 400 మంది విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు.

వైభవంగా షష్ఠి మహోత్సవాలు

ఆలయాల్లో భక్తుల కిటకిట



పోస్టల్ కాలనీలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే నాని



దొండపాడు దత్త నాథక్షేత్రంలో దత్త సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం



40వ డివిజన్‌లో సుబ్రహ్మణ్య స్వామి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు



పోస్టల్ కాలనీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి



సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలోని స్వయంభు పుట్ట వద్ద భక్తుల పూజలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): మార్గశిర శుద్ధ షష్ఠి పర్వదినం సందర్భంగా ఏలూరు నగరంలోని పలు ఆలయాల్లో షష్ఠి మహోత్సవాలు సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పోస్టల్ కాలనీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి దేవస్థానానికి తెల్లవారు జామునుంచే భక్తులు తరలిచ్చారు. ఆలయ ప్రాంగణంలోని జంట నాగులకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఆలయంలో స్వయంభు వల్మీకం (పుట్టలో) పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలోని స్వామి వారి మూల విరాట్టుకు విశేష అభిషేకాలు నిర్వహించారు. నిత్య హోమం, బలిహరణ, స్వామి వారికి విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామి వారి 23వ వార్షిక శాంతి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ఆళ్ల నాని స్వామి వారిని దర్శించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఆయన వెంట నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్ కుమార్, కార్పొరేటర్ యర్రంశెట్టి సుమాన్ తదితరులున్నారు. తొలుత వైఎస్సార్ సీపీ నాయకుడు జీహెచ్‌డీ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యే నానికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అర్చకులు నానికి వేద ఆశీర్వచనం పలికి స్వామి వారి ప్రసాదం అందజేశారు. అర్చకులు రవికుమార్ శర్మ విశేష పూజలు, అభిషేకాలు చేయగా, కార్యనిర్వహణాధికారి కలగర శ్రీనివాస్ కార్యక్రమాలను పర్యవేక్షించారు. దండపాడు శ్రీనం దత్తనాథ క్షేత్రంలో షష్ఠి మహోత్సవాల్లో భాగంగా ఉదయం ఆలయ ప్రదక్షిణ, విఘ్నేశ్వర పూజ, కావడి సేవలు నిర్వహించారు. భక్తులు స్వయంగా స్వామి వారికి అభిషేకాలు చేశారు. ఉదయం 8 గంటలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, శ్రీదత్త సుబ్రహ్మణ్య మూలమంత్ర హవనం చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం దత్త సుబ్రహ్మణ్య స్వామి శాంతి కల్యాణం అంగరంగ వైభంగా జరిగింది. అర్చకులు గంటసాల రామకృష్ణ విశేష పూజలు చేయగా, వ్యవస్థాపక ట్రస్టీ వేణుగోపాల్ లునాని, కార్యదర్శి కాకి బాబు కార్యక్రమాలను పర్యవేక్షించారు. అశోక్ నగర్‌లోని సుబ్రహ్మణ్య స్వామి దేవస్థానంలో స్వామి వారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. 40వ డివిజన్‌లోని కొత్తపేట రామాలయం వద్ద సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో సోమవారం ప్రథమ కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. రామాలయం కమిటీ ప్రతినిధి మద్రాపు జగదీశ్వరరావు నాగలక్ష్మి దంపతులు కన్యాదాతలుగా వ్యవహరించారు.

సత్ప్రవర్తనతోనే ఉన్నత స్థానాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): యువత వ్యక్తిత్వ వికాసం అభివృద్ధి చేసుకోవాలని, సత్ప్రవర్తనతో సమాజంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని నేషనల్ కెరీర్ సెంటర్ జిల్లా కోఆర్డినేటర్ జి.ప్రవీణ్ కృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక సత్రంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యువజన సర్వీసుల శాఖ, సెట్‌వెల్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్ అవగాహన తరగతిలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కెరీర్ కౌన్సిలర్ ఆర్ విజయ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత లక్ష్యం కోసం కృషితో చదివి జ్ఞానం సంపాదించాలని, జ్ఞానంతో లక్ష్యాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో సెట్‌వెల్ మేనేజర్ పీవీఎస్ సత్యనారాయణ, పర్యవేక్షకులు కేజే కెనడీ, ఒకేషనల్ గైడెన్స్ ఎక్జిక్యూటివ్ అధికారి వి.వరలక్ష్మి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్): అంగన్‌వాడీల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబీరాణి కోరారు. అంగన్‌వాడీల నిరవధిక సమ్మె సోమవారం కొనసాగింది. తొలుత జూట్ మిల్లు సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకు ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా బేబీరాణి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ మాట్లాడారు. యూనియన్ ఏలూరు అర్బన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు రజని అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు పి.హైమావతి, తిరుపతమ్మ, చెల్లమ్మ, స్వర్ణ కుమారి, బి.సోమయ్య, వి.సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఖర్చు లేకుండా కార్పొరేట్ వైద్యం





వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న మేయర్ నూర్జహాన్

మేయర్ నూర్జహాన్

ఏలూరు టౌన్: రాష్ట్రంలో పేద, మధ్యతరగతి వర్గాల కుటుంబాలకు ఒక్క రూపాయి ఖర్చు లేకుండా కార్పొరేట్ వైద్యాన్ని అందించాలనే లక్ష్యంతో వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.25 లక్షలకు పెంపు చేయడం ద్వారా పేదలకు ఆరోగ్య భరోసా లభిస్తోందని ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ అన్నారు. ఆరోగ్యశ్రీ పథకంలో ఉచితంగా వైద్యం పొందడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాప్రతినిధులు, అధికారులకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ఏలూరు నగర పాలక సంస్థ కార్యాలయంలో ఆమె వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. మేయర్ నూర్జహాన్ మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకంలో రోగాల సంఖ్యను 3,215 పెంచడంతో పాటు వైద్య ఖర్చులను భారీగా పెంచుతూ నిర్ణయించడం అభినందనీయమన్నారు. గతంలో సంవత్సరానికి రూ.10 లక్షలు ఉండగా ప్రస్తుతం ఆరోగ్యశ్రీ వైద్య ఖర్చులను రూ.25 లక్షలకు వర్తించేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల ఆరోగ్యం, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని నాడు ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. కులం, మతం, పార్టీలు బేదం లేకుండా అర్హతే ప్రామాణికంగా ఆరోగ్యశ్రీ ప్రవేశపెట్టి పేదల పాలిట పెన్నిధిగా మారారని అన్నారు. దివంగత వైఎస్సార్ అనంతరం ఆరోగ్యశ్రీ పథకాన్ని టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసి పేదలకు వైద్యాన్ని దూరం చేసిందని ఆరోపించారు. నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ఆరోగ్య శ్రీ పథకానికి కొత్త జవసత్వాలు తీసుకొచ్చారని చెప్పారు. ఏలూరు కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్‌పెదబాబు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతి, నగరపాలక సంస్థ అధికారులు ఉన్నారు.

నేటి నుంచి విర్డ్‌లో ప్రత్యేక వైద్య శిబిరం

ద్వారకాతిరుమల: స్థానిక విర్డ్ ఆస్పత్రిలో ఈనెల 19, 20 తేదీల్లో రెండు రోజుల పాటు ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్టు ట్రస్ట్ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు తెలిపారు. ప్రముఖ హ్యాండ్ సర్జన్ డాక్టర్ భాస్కరానంద్ కుమార్‌చే ఈ క్యాంప్ నిర్వహించ బడుతుందన్నారు. పుట్టుకతో వచ్చిన చేతి సమస్యలు, పోలియో, అన్ని రకాల చేతి సమస్యలు ఉన్నవారు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో నిర్దేశించిన వైద్య సేవలను ఉచితంగా అందిస్తామన్నారు. ఈ వైద్య సేవలను పొందే వారు ముందుగా 85002 63149 నంబర్‌కు ఫోన్ చేసి, తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. రోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

20న మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ సమ్మె



సమావేశంలో మాట్లాడుతున్న ఐఎంఎ అధ్యక్షుడు సదాశివరావు

ఏలూరు (టూటౌన్): మందులు, వైద్య పరికరాలపై జీఎస్టీ ఎత్తివేసి మందుల ధరలు తగ్గించాలని కోరుతూ మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ ఈనెల 20న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఐఎంఎ అధ్యక్షుడు ఎంవీ సదాశివరావు పిలుపునిచ్చారు. స్థానిక పవరుపేటలోని సీఐటీయూ కార్యాలయంలో మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా నాయకుడె వీవీఎస్ ప్రసాద్ అధ్యక్షతన సోమవారం ఏర్పాటుచేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో సదాశివరావు మాట్లాడారు. మందులు, వైద్య పరికరాలు, వ్యాక్సిన్లపై జీఎస్టీ తొలగించాలని డిమాండ్ చేయడం ప్రజలకు చాలా అవసరమని అన్నారు. అసోసియేషన్ కార్యదర్శి కె.బాజీ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, ఏఐటీయూసీ జిల్లా నాయకులు బండి వెంకటేశ్వరరావు, ఇఫ్టూ నాయకుడు బద్దా వెంకట్రావు, ఎల్ఐసీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఐవీ సుధాకర్‌లు మాట్లాడుతూ 20న సమ్మెకు మద్దతు తెలిపారు. ముందులు, వైద్య పరికరాలపై 12 నుంచి 18 శాతం వరకు బీజేపీ ప్రభుత్వం జీఎస్టీ విధించిందని ఆరోపించారు. మెడికల్ రిప్రజెంటేటివ్స్ ఎంప్లాయీస్ యాక్ట్ 1976ను పునరుద్ధరించి అమలు చేయాలని, సేల్స్ ప్రమోషన్ ఉద్యోగులకు చట్టబద్ధమైన పని, విధానాలు నిర్ణయించాలని కోరారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు జె.గోపి, పి.కిషోర్, బి.జగన్నాథం, వి.సాయిబాబు, మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ ఏలూరు అధ్యక్షుడు బీవీ సత్యనారాయణ, కార్యదర్శి సీహెచ్ సీతయ్య, కోశాధికారి పి.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు దుర్గారావు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడలకు కలపర్రు విద్యార్థిని సాత్విక

పెదపాడు: జాతీయ క్రీడలకు కలపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు కె.భీమయ్య తెలిపారు. విద్యార్థిని మాయ సాత్విక, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నరసారావుపేటలో నిర్వహించిన అండర్-17 విభాగంలో బంగారు పతకాన్ని సాధించిందని తెలిపారు. సోమవారం సాత్వికను జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతోపాటు, సర్పంచ్ వట్రపు విష్ణు తులసి, ఎంపీటీసీ కంభం నాగరాజు, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ నలకుర్తి శంకరరావు, వ్యాయామ ఉపాధ్యాయురాలు పద్మజయలక్ష్మి అభినందించారు.

సేంద్రియ సాగుతో ప్రజల ఆరోగ్యానికి రక్ష

గణపవరం: అన్ని పంటల్లో సేంద్రియ వ్యవసాయ విధానాలను అవలంభించాలని, అదే అందరి ఆరోగ్యానికి శ్రీరామరక్ష అని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి, ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. సోమవారం గణపవరం మండలం అప్పనపేటలో వైఎస్సార్ పొలంబడి క్షేత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. సర్పంచ్ నూకారపు సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన సభలో కలెక్టరు మాట్లాడుతూ రైతులు వ్యవసాయ అధికార్లు శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు పాటిస్తే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి సాధించవచ్చునని, తద్వారా వ్యవసాయం లాభసాటిగా మారుతుందన్నారు. రైతులు తమ సొంత పద్ధతులు అనుసరించడంతో 30 నుంచి 40 శాతం పెట్టుబడులు పెరిగిపోయాయన్నారు. రైతుల వైఎస్సార్ పొలంబడి ద్వారా సాగులో మెళుకువలు, తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి, నాణ్యమైన ఉత్పత్తులు సాధించవచ్చునన్నారు. ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ గత ప్రభుత్వం రైతులను తీవ్ర నిర్లక్ష్యం చేసిన కారణంగా అనేకమంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని, మరికొందరు రైతులు వ్యవసాయాన్ని వదిలి కూలీలుగా మారారని తెలిపారు. వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే రైతులకు అండగా నిలిచి వారి సంక్షమానికి ఎన్నో పథకాలు అమలు చేస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చారని అన్నారు. ప్రభుత్వం ఆర్‌బీకేలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో రైతులకు మార్గదర్శనం చేస్తూ వ్యవసాయాన్ని పరిపుష్టి చేసిందన్నారు. వైఎస్ జగన్ రైతులకు అండగా నిలిచారన్నారు. రైతులంతా సేంద్రియ వ్యసాయం పైపు దృష్టి సారించాలన్నారు. ఈ సందర్భంగా రైతులకు వ్యవసాయ అధికారులు పలు సూచనలు, సలహాలు ఇచ్చి వారి అనుమానాలు నివృత్తి చేశా రు. ఈ సందర్భంగా నాణ్యమైన ధాన్యం ఉత్పత్తు లు సాధించినందుకు రైతులను అభినందించా రు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు, ఏడీఏ పి.మురళీకృష్ణ, ఏవో యర్రంశెట్టి ప్రసాద్, ఎంపీపీ అర్ధవరం రాము, సొసైటీ అధ్యక్షుడు మురళీరాజు, జిల్లా వ్యవసాయ సల హా సంఘం చైర్మన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	35
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	36
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	41
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	23

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	27
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	26
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	35
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	24
ద్వారకాతిరుమల -ఏలూరు- బీహెచ్‌ఈఎల్	22.15	4822	26
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	37
ఏలూరు -తిరుపతి	16.00	4830	24

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	28	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	50	చిక్కుడు కాయలు	72
వంకాయలు (కాంతులు)	60	బిళ్ళచిక్కుడు	92
వంకాయలు (తెలుపు)	40	చామదుంపలు	48
బెండకాయలు	68	ములక్కాడలు	10-15
పచ్చిమిర్చి	38	కంద	50
కాకర కాయలు	60	బీట్‌రూట్	40
బీరకాయలు	50	కీర దోస	40
బీరకాయలు (పందిరి)	68	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	24	అల్లం	120
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	74	పాలకూర	12
బంగాళదుంపలు	26	చుక్కకూర	12
ఉల్లిపాయలు	35-40	తోటకూర	12
గోరుచిక్కుడు	52	గోంగూర	08
దోసకాయలు	40-48	పుదీనా	05
ఆనబకాయ (1)	30-40	క్యాప్సికమ్	72
పొట్లకాయ(1)	20-25	చిలకదదుంప	40

వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో జోష్

ద్వారకాతిరుమల: దేవరపల్లిలో ఆదివారం జరిగిన సామాజిక సాధికార బస్సు యాత్ర సూపర్ సక్సెస్ కావడంతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో జోష్ నింపింది. సభను విజయవంతం చేయడానికి గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ద్వారకాతిరుమల, నల్లజర్ల, దేవరపల్లి, గోపాలపురం మండలాల నేతలతో ఎప్పటికప్పుడు మాట్లాడారు. దాంతో నేతలు బస్సు యాత్రను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. ఈ నేపథ్యంలో జరిగిన బస్సు యాత్ర సభకు ఊహించిన దానికంటే ఎక్కువ మంది జనం రావడం క్యాడర్లో ఉత్తేజాన్ని నింపింది. వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బస్సుయాత్ర పార్టీకి మంచి బలాన్నిచ్చిందని స్థానికంగా పలువురు చర్చించుకుంటున్నారు. నియోజకవర్గంలోని పలు పంచాయతీల్లో ఇటీవల జరిగిన, ప్రస్తుతం జరుగుతున్న వై ఏపీ నీడ్స్ జగన్, జగనన్నకు చెబుదాం, జగనన్న ఆరోగ్య సురక్ష, నిరుపేదలకు భూపంపిణీ, ఆడుదాం ఆంధ్రా వంటి పలు కార్యక్రమాల ద్వారా ఎమ్మెల్యే తలారి నిత్యం జనంతో మమేకమవుతూనే ఉన్నారు. ఇలా ఎమ్మెల్యే ప్రజలకు బాగా దగ్గర కావడంతో పాటు, పార్టీ నేతలు కష్టపడి పనిచేయడం వల్ల సామాజిక సాధికార యాత్రకు జనం స్వచ్ఛందంగా హాజరైనట్టు రాజకీయవర్గాలు భావిస్తున్నాయి. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు నిత్యం ఏదో ఒక కార్యక్రమంతో గ్రామాలకు వెళుతూనే ఉన్నారు. ఇవన్నీ బస్సు యాత్ర విజయానికి కారణమని పార్టీ శ్రేణులు చెబుతున్నాయి.

ధనుర్మాస హారతి

దెందులూరు: ధనుర్మాసం పురస్కరించుకుని శ్రీ రామదండు మండల కమిటీ ఆధ్వర్యంలో సోమవారం దెందులూరు విష్ణు ఆలయంలో నవనీత హారతినిచ్చారు. తొలుత భక్తులు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరామదండు మండలి కమిటీ ప్రతినిధి సుగ్గిశెట్టి నూకరాజు మాట్లాడుతూ ఈ నెల 22న ధనుర్మాసాన్ని పురస్కరించుకుని తెల్లవారుజామున 4 గంటలకు నగర సంకీర్తన నిర్వహిస్తారన్నారు. 23న ముక్కోటి ఏకాదశి సందర్భంగా తెల్లవారుజామున 4.05 గంటలకు ఉత్తర ద్వారదర్శనం కల్పించనున్నట్టు తెలిపారు.

ఆశ్రమానికి మతిస్థిమితం లేని మహిళ



ఏలూరు టౌన్: ఏలూరు పెద్ద రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం నెంబర్ 1పై మతిస్థిమితం లేని మహిళను గుర్తించి ఆశ్రమానికి తరలించినట్టు ఏలూరు రైల్వే ఎస్సై డి.నర్సింహారావు తెలిపారు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన రోజీ (30) అనే మహిళ మతిస్థిమితం లేకుండా రైల్వే ప్లాట్‌ఫామ్‌పై తిరుగుతూ ఉండగా గుర్తించామన్నారు. ఆమెను తొలుత హనుమాన్ జంక్షన్‌లోని జేఎంయూ ఉజ్వల హోమ్‌కు మహిళా కానిస్టేబుల్‌తో పంపామని, అనంతరం అక్కడ నుంచి విజయవాడ గుణదలలోని మిన్నిస్ట్రీ ఆఫ్ మదర్ థెరిస్సా ప్రేమ్‌దాస్ ఆశ్రమానికి తీసుకెళ్లి అప్పగించామని చెప్పారు. ఆమె వివరాలు తెలిసిన వారు ఫోన్ నెంబర్ 95020 97672కు తెలియజేయాలని కోరారు.

దేశంలోనే మహోన్నతమైన పథకం ఆరోగ్యశ్రీ

దెందులూరు: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం దేశంలోనే మహోన్నతమైనదని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అభివర్ణించారు. సోమవారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ పథకంలో వైద్య సేవలు రూ. 25 లక్షల వరకు పరిధిని పెంచడం హర్షణీయమన్నారు. దివంగత నేత వైఎస్సార్ బాటలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, బడుగు, బలహీన ప్రజల అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తున్నారని అన్నారు. ఇప్పటికే క్యాన్సర్‌తో పాటు ఎన్నో వ్యాధులను ఈ పథకంలో చేర్చడమే కాకుండా పరిధి మితిని రూ.25 లక్షలకు పెంచడం ప్రతి ఒక్కరికీ అభయహస్తంలా ఆరోగ్యశ్రీ పథకం మారిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఆరోగ్యశ్రీ పథకం నగదు పరిమితి పెంపుదలపై విస్తృత ప్రచారం చేయాలని కోరారు.

పాస్టర్ల ఆధ్యాత్మిక సేవలు స్ఫూర్తిదాయకం

దెందులూరు: ఏలూరు ఆర్సీఎం పీఠంలోని ఉపదేశీయుల ఆధ్యాత్మిక సేవలు స్ఫూర్తిదాయకమని అనునిత్యం ఆధ్యాత్మిక చింతనలో వారి సేవలు అభినందనీయమని ఆర్సీఎం ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు అన్నారు. సోమవారం సెయింట్ జాన్స్ విద్యా సంస్థలో ఏలూరు పీఠం వికారల్ జనరల్ ఫాదర్ పి. బాల ఆధ్వర్యంలో ఏలూరు పీఠంలోని రెండు జిల్లాల్లో ఉపదేశీయులకు దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం సెమీ క్రిస్మస్ వేడుక నిర్వహించారు. కేక్ కట్ చేసి క్రిస్మస్ సందేశాన్ని అందించారు. మరింత ఆధ్యాత్మిక అభివృద్ధికి సేవలందించాలని పీఠాధిపతి ఉపదేశీయులను కోరారు. ఏలూరు పీఠం ప్రొక్యూరేటర్ ఫాదర్ రాజు, ఫాదర్ మోజెస్, తంగెళ్ళమూడి ఫాదర్ బాబు జార్జి, ఫాదర్ చైతన్య, రెండు జిల్లాల పాస్టర్లు పాల్గొన్నారు.

దేవదాయ ధర్మదాయ శాఖ
శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి వారి దేవస్థానం, పవర్‌పేట, ఏలూరు
చీరల బహిరంగవేలం ప్రకటన
ఏలూరు, పవర్‌పేటలో వేంచేసియున్న శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి వారి దేవస్థానములో అమ్మవారికి సమర్పించిన చీరలు, జాకెట్ ముక్కలు అమ్ముకొనుటకు 21.12.2023వ తేదీ సాయంత్రం 3.00 లకు బహిరంగ వేలం నిర్వహించబడును. కావున ఆసక్తి గల భక్తులు బహిరంగ వేలంపాటలో పాల్గొనవలసినదిగా కోరడమైనది.
ఏలూరు ది.18-12-2023 — కార్యనిర్వహణాధికారి, సెల్ - 98882 71890

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఏలూరు
99122 20559
95055 08399
96408 32693
Office mail : tpgadvt@gmail.com